

# దేవుడెలా తయారైనాడు

వైరొచ్చిందని, తలుపు బాదుతూ అరుస్తున్నాడు పోస్టుమాన్. అర్ధరాత్రి కావస్తున్నది. సహనం చస్తున్నది.

గీత డబుల్ రీడ్స్ హార్మోనియం పాతది వాయిస్తున్నది. ఆమె వినికిడి యంత్రం పాతదైంది. జర్మన్ మేడ్. మెర్క్యురీ బాటరీ కొత్తది లభించలేదు. రిలోడ్ చేసే యంత్రసాయంతో రిలోడ్ చేసిచ్చాడు ఎలక్ట్రీషియన్. గది తలుపు బిగించా గదా అని గట్టిగా వాయిస్తున్నది గీత. యేదో వేరే చప్పుడు. లేచి వెళ్లి హాలులో లైటు వేసి, వరండాలో లైటు వేసి తలుపు తీసింది.

స్టాండు వేసిన యెర్ర సైకిలు, పోస్టువాడూ కంటబడ్డారు.

''యెంతసేపటినించీ బాదుతున్నాను? చెముడా? వైరందుకోరా?'' అని పురిమి కవరు పెన్ను అందించాడు.

''చెముడే'' సంతకం చేయమన్న చోట చేసి కాగితం పెన్నూ యిచ్చేసింది గీత.

''యేదో సంగీతం వినిపిచ్చిందే?''

''నేనే వాయిస్తున్నా హార్మనీ. వినికిడి యంత్రం కనబడటం లేదూ? సీక్రెట్ యియర్ ఫోన్ లేదే బయటికే దర్శనమిస్తుందే''.

'' ఐసీ నౌ. సారీ మేడమ్'' సైకిలెక్కి వెళ్లిపోయాడు.

తలుపుమూసి లైటార్పి వెనక్కు తిరిగేప్పటికి సర్జన్ హరి కనిపించాడు. నైట్ డ్రెస్ నిద్ర కళ్లు.

''యెవరొచ్చారు? అర్ధరాత్రి తలుపు తీయచ్చా? నన్ను లేపక్కర్లేదూ? వాడెవరో'' అని విసుగ్గా చూశాడు.

కవరు చింపి లోపలి కాగితం అందించింది గీత.

''తలుపు బాదుతున్నాడు. మీకూ వినబడలేదన్నమాట''.

కాగితం విప్పి చదివాడు సర్జన్. '' ఇవాళ పొద్దుటినించీ హెవీ వర్క్. మధ్యాహ్నం యేదో తిన్నాను. సహించలేదు. సాయంకాలమూ పనే. పొద్దుబోయి వస్తిని భోజనం రుచిగా పెడ్తే కడుపునిండా తిన్నా. వళ్లు నెప్పులు. టాబ్లెట్ వేసుకుని పడుకున్నా. మంచి నిద్రబట్టింది'' వైరు చదివాడు సర్జన్ హరి. ''కూర్మావతారం సీరియస్. స్టార్ట్ యిమ్మీడియట్లీ''.

''నువ్వు పొద్దున రైలందుకుని వెళ్లు. పిల్లల్ని నౌకర్లు చూస్తార్లే. నాకు శలవు లేదు. మూడు ఛార్జీలు తీసుకున్నా. వాళ్లు యెగ్జామినర్స్‌గా వెళ్లారు. ఇంకా రాలేదు''. బెడ్‌రూమ్‌లో కెళ్లాడు హరి.

ఓపెన్ చేసి కిందబడేసిన కవర్ తీసి చూసింది గీత.

బెడ్‌రూమ్‌లో కెళ్తే బెడ్ మీద వెల్లికిలా పడుకుని కళ్లు మూతలు పడివున్న సర్జన్ కనిపించాడు.

'' ఇదుగో చూడండి. మీ పేరే వైరిచ్చారు. మీరే వెళ్లాలి. సర్జన్‌తోనే పనిబడింది. నాతో గాదు. నేనే వెళ్తే ''సర్జనేడే? వెంట రాలేదూ? డబ్బూ లేకుండా సిరికిన్ చెప్పడు లాగా వచ్చావా? యేం సర్జన్ వాళ్ల వాళ్లు వైరివ్వగానే అర్జంటుగా శలవు పారేసి వెళ్లటం లేదూ? మేం వైరిస్తేనే నా శలవు అందదూ? అల్లుడై సమర్థుడై వుండీ ఆదుకోక్కర్లేదూ? శుష్కప్రియాలు పలికి శూన్యహస్తాలు చూపేందుకేనా వచ్చావూ దద్దమ్మా? నీ ప్రయోజకత్త్వం కనబడుతూనే వున్నది'' అని పాఠం వల్లిస్తుందండీ తల్లిగారు'' అని తలవంచుకు వెళ్లిపోతున్న గీత వంక బరువైన కనురెప్పలెత్తి చూసి, అటుతిరిగి పడుకున్నాడు హరి. లైటార్పి తన రూమ్‌లో కెళ్లింది గీత.

2

ముగ్గురికీ ఛార్జీ లిచ్చేశాడు హరి. డబ్బు డ్రా చేసి వచ్చేప్పటికి ఆర్‌యమ్‌ఓ దయానంద తన కారులో వెళ్లమన్నాడు. కారు స్టార్ట్ చేస్తుండగా డ్రైవర్ అబ్రహామ్ వచ్చాడు.

''తమ్ముడి పెళ్లి ఆగిపోయింది సాబ్. శలవు కాన్సిల్ చేసి డ్యూటీలో

కొచ్చాను. ఈ కారు పాతది. ట్రబులివ్వచ్చు. నన్ను తీసికెళ్లండి సాబ్ శలవుపెట్టనా?'' అలా నవ్వుతూ చక్రం మీద చేయ్యేశాడు అబ్రహామ్'' శలవు చీటీ యిచ్చారా'' అన్నాడు హరి.

మెయిన్ గేటు దాటుతుండగా నాగిరెడ్డి రైతు వచ్చి దణ్ణం పెట్టాడు. కారాగింది.

''తమ దయవల్ల నా పొలంలోకి కాలవ శాంక్షనైంది సార్. ఇంక యెవరి చుట్టూ తిరిగేపనిలేదు సార్. మీ మాట గట్టిపనిచేసింది. అలా అంటూ తలపాగా విప్పి గుడ్డ సంచీ అందిస్తూ, ''తీసుకోండి దొరా. నా అవసరం మీ కర్థమైంది. మీ అవసరానికని దీన్ని సంతోషంగా యిస్తున్నాను'' అని తొలగిపోయాడు.

ఇల్లు చేరేప్పటికి గీత యిద్దరు చిన్న పిల్లలు హాలులో కూచుని యెదురు చూస్తున్నారు. సోఫాలో వున్న డాక్టరమ్మ లేచి నమస్కారం చేసింది. ''నా మీద కేసు కొట్టేశారు సాబ్. మీరు అందర్నీ కూడగట్టుకుని, ఒక్క తాటి మీద నడిపించారు స్టాఫ్‌ని. రక్షణశాఖకి, వారడిగిన దొంగసర్టిఫికెట్లివ్వనని గుర్రుగా వుండి, కక్ష సాధించాలని కేసు బనాయించారు. వాళ్ల ఆఫీసర్ని కొట్టాననేది ఋజువు కాలేదు. సాక్ష్యం యెవరూ యివ్వలేదు. నా పక్షమే పలికారు. థాంక్స్. ఒంటరిదాన్నని యెవ్వరూ హెల్ప్ చేయరని అనుకున్నారేమో సాబ్. నేనూ వర్రీ అయాను. కాని మీరు చక్రం తిప్పి వెలుగు చూపారు'' నించుని కర్చీఫ్‌తో మొహం అద్దుకుంటూ సరికొత్త లెదర్‌బాగ్ అందించింది నూర్జహాన్ బేగం'' డ్యూటీ కెళ్లాలి సార్'' అంటూ వెళ్లి తన కారెక్కింది డాక్టరమ్మ.

సంచీ గీత కందించాడు హరి. ''బయలుదేరాలి'' అన్నాడు.

3

గమ్యం చేరి, పక్క మీదున్న పేషంటుని పరీక్ష చేసి, సోది విన్నాడు హరి. వడలిపోయి ఒరుగులాగా వున్న తల్లి మహాకష్ట దశ అని అభినయం పట్టింది. చేతులు నలుపుకుంటూ, కళ్లు వత్తుకుంటూ, గూడెగరేస్తూ, ముసుగు సవరించుకుంటూ, పమిట సరిచేసుకుంటూ అన్నది. '' నేను ఐవేజు తేవటానికి

స్వగ్రామం వెళ్లాను నాయనా. వీడినే కనిబెట్టుకునుంటే రైతులు మోసంజేసి కాజేస్తారు. కలెక్టు చేసి వచ్చి యింట్లో అడుగుపెట్టాను. వీడు అష్టవంకర్లు తిరిగి పడిపోయినాడు. డబ్బుకి లెక్కజేయక డాక్టర్ని తెచ్చాను. అదేదో ఫిట్టు సెలైనెక్కించాలన్నాడు. నాకు ధర తెలియదు. నేనెప్పుడూ స్వంత వైద్యమే చేసుకున్నాను. ఇంజెక్షన్లూ మందులూ కొనలేదు'' అని గద్గద స్వరంతో అంటూ కాషాయాంబరంతో కళ్లు తుడుచుకున్నది.

''పెద్ద హాస్పటల్లో చేర్పించాలి. అన్నీ అందుబాటులో వుంటాయి. సూపరింటెండెంట్ నాకు తెలిసిన వాడే. నేను అరేంజ్ చేసి చెప్పిపోతాను. శలవు లేదు. పోవాలి నేను'' తాను తెచ్చిన మందులందించాడు హరి.

''నీ దోవన నువ్వు వెళ్లిపోతే వాళ్లెందుకు వెరుస్తారు మాకూ? ప్రాణాలు తీస్తారు. చెట్టంత కూతురు హాస్పటల్లో చేర్పించిన అపరేషన్ జరిగిన అర్ధరాత్రి పోయింది. అధికారి నర్సులూ అలక్ష్యం చేశారన్నారు అక్కడున్నవారు''.

''నేను పోవాలి. నాతో రండి. లోపం లేకుండా అన్నీ అరేంజ్ చేసి వెళ్తాను. మీరు దగ్గరే వుండచ్చు'' అని వీధిలో కెళ్లాడు హరి.

కూతురు డబ్బు సంచీ అందివ్వగానే తల్లి కళ్లు మెరిసినై. '' ఇప్పటికి చాలు'' అన్నది. కూతురు వండినవి తిని, తక్కినవి మూటకట్టింది. కారులో పరుపువేసి రోగినందులో భద్రంగా చేర్చారు. కోడలు, మనవడు, బావమరిది పక్కింటాయన తోడు రావాలంటే వచ్చారు. అంతా యిరికిరికి ఒరుసుకుంటూ ఒకళ్ల ఒళ్లో ఒకళ్లు కూచుంటే డ్రైవరు నవ్వాపుకుంటూ కారు స్టార్టు చేశాడు.

## 4

హాస్పటల్లో అరేంజ్‌మెంట్సు పూర్తి చేసి, వూళ్లో వున్న బంధువుల్ని చూడవెళ్లాడు హరి. గీత తరచూ రాదు. పిల్లలకి బడి. పట్నం చూస్తారనీ తలచాడు హరి.

సముద్రంలో వున్నవాడికి గడ్డిపోచ అందినా పట్టుకుంటాడట. అలాగా వైద్యుడి నందరూ అందుకున్నారు. మరి సంసారం సాగరమైపాయె. ఒకరికి

పారా టైఫాయిడ్, మరొకరికి దగ్గు పిల్లి కూతలూ ఆయాసమూ. తల్లికి కాళ్లు వంకర పోయాయి. తండ్రికి గూడలు దండలు నెప్పి. తన పనులు తాను చేసుకోలేక అవస్థ పడుతున్నాడు. వంటమనిషికి నోరు పూసింది. చెల్లికి కళ్ల కలక, తమ్ముని కొడుక్కి లివరు పనిచేయక ఆకలి లేదు. అలా అందరూ తమ కంప్లెయింట్సు చెప్పి నయంచేసి పొమ్మన్నారు. మంచి ఘనవైద్యుఁడే అందలేదట. మంగలిని చూడగానే యెద్దు మూడు కాళ్ల మీద నడుస్తుందని ఒక సామెత వున్నది. అలాగా యిరుగు పొరుగు, పనివాళ్లూ తమ తమ దేహ వ్యాధులు చెప్పుకొన్నారు. విన్నాడు హరి. వైద్యం చేస్తూనే వున్నాడు. గీత వంట అందుకుంటే పిల్లలు గెంతుతూ నవ్వుతూ, కిరాణా తెచ్చి, బోర్ వెల్ కొట్టి చేయగలిగిన పన్లన్నీ చేశారు. డ్రైవరు కారు తోలుతూ తీసికెళ్లమన్న చోటికల్లా తీసికెళ్లి తెచ్చాడు.

''దేముడల్లే వచ్చి ఆదుకున్నావు హరీ!'' అన్నారు.

హరి ఫిజీషన్ను పట్టుకొచ్చి వివరాలు చెపుతూ తాను వెళ్లిపోయినా వారందరినీ ఆరోగ్యవంతులను చేయాలని చెప్పాడు.

''అలాగే హరీ, మా ప్రాక్టీస్ పెంచావు దేముడల్లే ఆదాయం బాగున్నది. ఎక్స్పెర్టైనాం. రిచ్ పేషంట్సుని కుదిర్చావ్ మోసం చేయలేక, రాబడి పడిపోయి అవస్థ పడుతున్నాం'' అని స్నేహితులు నవ్వి థాంక్స్ చెప్పారు.

మందులు, ఇంజెక్షన్స్, టానిక్కులు, బాండేజ్ గుడ్డ, పట్టీలు వేసుకునే మందున్న బాండేజెస్, టాబ్లెట్సు, ఆయింట్మెంట్సు, బామ్స్, పంటి నెప్పికి, చెవిపోటుకు, ఆఖరికి స్పిరిట్ పోసి పేరు వ్రాసి వుంచిన సీసా, దూది అలా అన్నీ కొని, చిన్న సైజు సర్జరీ అమర్చాడు హరి. కొత్త వంటవాడు, వాడికో అసిస్టెంటు. అందర్నీ చూసి వచ్చారు.

యెనిమిదవ రోజున బయలుదేరారు హరి, గీతా, పిల్లలు.

''నువ్వు గూడా వెళ్లిపోతావనుకోలేదు. బాగా నిమ్మళించే దాకా సాయంగా వుంటావనుకున్నాము'' అన్నారు బంధువులు.

''నేను చేయలేనండీ. యెబార్షన్ చేయించారు. చాలా రక్తం కోల్పోయినా ''రోగం రోగం అని రోజూ కంప్లెయింట్ చేస్తుంది'' అని అందరెదుటా నవ్వుతారు హరిగారు'' అన్నది గీత.

''అంటే యేమిటి? నాకు తెలియదు. ఇంగ్లీషు రాదు'' అన్నదత్తగారు.

''అంటే గర్భ విచ్ఛిత్తి'' అని నవ్వింది గీత.

''అయ్యో!'' అని నోటిమీద చేయివేసుకున్న దత్తగారు ''దేముడిస్తుంటే సుఖంగా కనిపెంచుకోక'' అని నిట్టూర్చి విచారం అభినయించిందత్తగారు.

'' ఆ యిచ్చే దేముడే అలా చేయించాడు. పేరు గూడా దేముడి పేరే. దేముడంటి వారు అంటారందరూ. నేనే దేముడిని వేడుకున్నానట విచ్ఛిత్తి చేయమని'' అని నవ్వింది గీత. ''చేసినామెను పెద్ద కేసులోంచి తప్పించాడు దేముడు''.

5

కారు ట్రబులివ్వనే యిచ్చింది. ఆగిపోయింది.

''యేమైంది?'' అన్నాడు హరి.

''చెప్పాను సార్. పాత కారని. నన్ను కన్సల్ట్ చేసివుంటే లోపాలన్నీ చెప్పి వుండేవాడిని. చౌకగా వస్తున్నదని కొన్నారు. ఇప్పటికి యెనభై వేలదాకా ఖర్చు చేశారు రిపేర్లకి. కొత్తకారు అయిదు లక్షల వరకు పెరిగింది. అంతెక్కడున్నదీ అంటారండి బాబు. గాసు - యెక్కువే లాగుతుందండి. అయిపోయేదాకా చూడరాదు ముందే పోయించాలంటే, నవ్వుతారు బాబు. పోనీ డబ్బా అన్నా కారులో వుంచుకోరు. చెపితే నమ్మరేమో సార్. బంక్ కెళ్లి గాసు తెచ్చి, కారు టాంక్‌లో పోసి డబ్బా రిటర్న్ చేయిస్తారు సార్'' అని చేయి అడ్డం పెట్టుకు నవ్వాడు అబ్రహామ్'' అదో సార్ వర్క్‌షాప్'' అని చూపాడు.

''పద'' అన్నాడు హరి. ''అర్జంట్'' అని వూదరపెట్టాడు డ్రైవర్. పాయింట్ వేసీ, చక్రం మార్చీ, కొత్త స్పేర్ పార్ట్స్ అమర్చీ, టాంక్‌లో గాస్ పట్టించీ,

గాస్ వున్న కార్డ్ కొని కార్లో పెట్టించాడు. బిల్ తెచ్చి హరి కిచ్చాడు.

పిల్లలు వెనక సీట్లో పడుకున్నారు. గీత ఒక చెట్టు కింద రాతి మీద కూచుని చూస్తున్నది. రాత్రి తొమ్మిదిన్నరైంది.

డ్రైవరు కాంటీన్‌కెళ్లి ఆకులో తినేవి పెట్టించి తెచ్చి గీతకిచ్చాడు. ఒక ప్లాస్టిక్ గ్లాసుతో కాఫీ తెచ్చాడు.

ఒక వృద్ధ స్త్రీ కర్రపోటు వేసుకుంటూ వచ్చి చేయిజాపింది. ఆమె తల అదురుతున్నది. గీత ఆకు పొట్లాం టిఫిన్ యిచ్చేసి కాఫీ గ్లాసు అందించింది. ఆ స్త్రీ అక్కడే కూచుని టిఫిన్ తిని కాఫీ తాగి దీవించి వెళ్లింది.

కారులో సద్దుక్కూచున్నారు ''తినకుండా అంతా యిచ్చేశావేం?'' అడిగాడు హరి.

'' ఆకలి వేళ, తిండిలేక పడిపోతుందని యిచ్చేశాను''

''మా వాళ్లంతా ఆపేక్షగా వుండిపొమ్మని అడిగితే వుండకుండా వచ్చేశావేం?''

''నా సంచీ ఖాళీ అయింది. మీరు అన్యాయార్జితానికి వెరుస్తారని మీ వాళ్లకి తెలియదు. మీ వితరణ గుణం చూసి రెండు చేతులా ఆర్జించి నా ఒడిలో పోస్తున్నారని వూహిస్తున్నారు'' వేగంగా పోతున్న కారు కిటికీలోంచి బయటికి చూసింది గీత.

6

ఇంటికొచ్చి పడ్డారు. హరి డ్యూటీలో కెళ్లిపోయాడు. ఇల్లంతా ఆర్డర్లో పెట్టిపక్కలు మార్చి, గిన్నెలు కడిగి వంట చేసింది గీత. పిల్లలు బడికి పరుగెత్తారు. రెండు రోజులు గడిచినై. అలసట తగ్గుతున్నది.

తల్లి, సోదరుడు, పిల్లవాడు బండి దిగి లోపలికొచ్చారు.

'' ఇక్కడ మంచి వైద్య మందుతున్నదని చెప్పారు. అందుకని వచ్చామే

గీతా. నువ్విచ్చిన సంచీ ఖాళీ అయింది. ఇదుగో సంచీ. పూర్తిగా నిమ్మళించక ముందే వాళ్లు పంపేశారు. వుంటే అన్న చుట్టూతా తిరిగేందుకు చాలా వదిలింది'' అన్నది తల్లి.

రెండున్నరకి ఆస్పతాలు నించి వచ్చిన హరి నేర్పుగా ఆశ్చర్యం దాచుకున్నాడు. మళ్లా హాస్పటల్లో చేర్పించాడు.

బొమికలు చిట్లినాయట. బాండేజ్ చేశారు. మూడు వారాలున్నారు. బాండేజ్ ప్లాస్టర్ తీసేశారు.

'' ఇంటికెళ్లచ్చున్నారు గీతా'' అన్నది తల్లి అంటే ఖర్చుల కిమ్మని సూచన. సంగీత సంచీ యిస్తే, ''యిప్పటికి చాల్లే. దీనికంతెక్కడ? నాకే కష్టంగా వున్నది'' అంటూ సంచీ కొంగుకి కట్టి ముడేసి భద్రంగా దోపుకున్నది తల్లి.

రైలు వేళకి భోజనం చేసి, దోవలోకి ఫలహారం పొట్లాలు కట్టి సంచీలో వుంచింది తల్లి. రైలులో పడుకునేందుకు రెండు బూరుగు దూది పరుపులు, రెండు దిళ్లు దుప్పట్లు బెడ్డింగ్ తయారు చేసింది.

హరి హాలులో కూచుని పత్రిక చూస్తున్నాడు.

''నేను హైదరాబాదు వెళ్లి బొమికల స్పెషలిస్టుకి చూపించుకుంటాను. రికమెండేషన్ లెటర్ వ్రాసివ్వండి. అక్కడ మా దాయాది అన్న వున్నాడు. వాళ్లింట్లో దిగుతాము. హాస్పటల్‌కి వెళతాము. అవసరమైతే అడ్మిట్ అవుతాను'' అన్నాడు బావమరిది.

హరి లెటర్ హెడ్డున్న లెటర్ పాడ్ తెచ్చి బావమరిది అడిగినది వ్రాసి యిచ్చాడు.

తల్లి వెళ్లే ముందు తలవంచుకుని ''హరి దేముడంతటివాడు గీతా. ఆపదలో వచ్చి ఆదుకుని సాయపడ్డాడు'' అని వెళ్లి కారులో దూరింది.

మరొక నెల గడిచింది. వరసన వుత్తరాలొచ్చాయి. అందరకూ నిమ్మళించి కులాసా చిక్కింది. తల్లి కాళ్లు మామూలుగా వచ్చాయిట. ''హరి దేముడు

గదూ గీతా అందరమూ గట్టున పడ్డాము. ఆపదలూ గట్టెక్కాయి''.

డాక్టర్ దయానంద ఆర్.యమ్. ఓ. వచ్చి కాసేపుండి, పిచ్చాపాటీ మాట్లాడి, కాఫీ తాగి స్నాక్సు తిన్నాడు.

''మిమ్మల్ని వూళ్ల వెంట తిప్పి చాలా లాగింది నా ముద్దుల కారు. మీరు లిబరల్ దేమునిలాంటి వారు గనక అదంతా నా నెత్తిన రుద్దలేదు. దాన్ని అమ్మాలనే నా ఆశ సార్. మీకు తెలిసిన వాళ్లుంటే వాళ్ల కంటగట్టండి సార్ ముడుపు చెల్లిస్తా'' అని పకపకా నవ్వాడు.

''అలాగే. యెవరూ అందకపోతే నేనే కొనాలేమో'' హరీ నవ్వాడు.

7

సర్జన్ హరి బెడ్ మీద కూచుని బార్‌లైట్ వెలుగులో లెక్క చూస్తున్నాడు. తొమ్మిది దాటింది. కూతురు ఆవలిస్తూ దూరదర్శన్ మీద పురాణగాథ సినిమా చూస్తున్నది. ఫాన్ మెల్లిగా తిరుగుతున్నది. యెయిర్ కండిషన్ రూమ్ మెల్లిగా చల్లదనాన్ని సంతరించుకుంటున్నది. వినోద యాత్ర కెళ్లిన పిల్లలిద్దరూ వచ్చారు. కబుర్లు చెప్పి వాళ్ల బెడ్‌రూమ్‌లో కెళ్లారు. మరొకమ్మాయి బొమ్మల పియానో వాయిస్తూ వింటున్నది. గీత తెలుగు వీక్లీ చూస్తున్నది.

''కారులో నీకు డబ్బున్న సంచీ యిచ్చాను. యేం చేశావు సుషమా?'' హరి అడిగాడు.

''అమ్మమ్మ నా చేతిలో డబ్బు సంచీ చూడగానే మరలా యేడ్చి ''మామయ్య పేదవాడు. జబ్బు పడ్డాడు. నువ్వు సాయపడాలి సంచీ యిటివ్వు'' అంటే యిచ్చేశాను నాన్నగారూ'' అని నవ్వింది.

సర్జనూ నవ్వి గీత వంక చూశాడు. గీత వచ్చి వంగి సర్జన్ వ్రాసిన లెక్క చదివింది.

''పదిరోజులలో యాభై వేలు'' అని వినపడకుండా అంటూ తలెత్తి చూసింది.

''మరి దేముడెలా తయారౌతాడు గీతా? ఆపదలు గట్టెక్కించి, కోరికలు తీర్చి, చేతులోది వదిలించుకుంటే అవుతాడు'', కాగితము కలమూ అవతలుంచి బెడ్ మీద వెల్లికలా పడుకుని తిరుగుతున్న సీలింగ్ ఫాన్ వంక చూశాడు హరి.